# బ్రతుకు తెరువు

కారు ఆగిన శబ్దం వినేటప్పటికి నోటి కందివ్వబోతున్న మా 'ఆవిడ' చేతిలోని తమల పాకుల చిలక జారిపోయింది. ఎన్నడూ కారు మొహం ఎరగని ఆవీధికి ఆరోజున కారు వచ్చిందంటే ఆశ్చర్యం కాదూ? వెంటనే వీధిలోనికి వెళ్ళి మా యింటి ముందరే ఆగిన కారుని చూసి మరీ ఆశ్చర్యపోయాం. వెంటనే ఆ కారులో నుండి పెద్ద ఉద్యోగస్తుడిలా ఉండే ఓ పెద్ద మనిషి దిగి నన్ను చూడ్డంతో నే 'గుడ్ మార్నింగ్' అన్నాడు.

ఎవరం వీరూ? అని మనస్సు ప్రశ్నిస్తూంది. ఏమీ జవాబు చెప్పలేక మెదడు తడువు లాడుకుంటూంది! నాకు తెలియని బంధు మహాశయుడు ఎవడూ అని ఆలోచించాను - కాని ఆ సమయంలో పలకరించకపోతే అవమాన పరచినట్టుంటుందని 'రిసీవ్' చేసుకున్నాను. అతగాడు మాటాడకండా యింట్లోకి వచ్చేశాడు! అంతచనువు చూపుతున్న ఆ పెద్ద మనిషిని ఏమీ అనలేక చూస్తూ ఊరుకున్నాను.

మనిషి చూస్తే యిర్వై ఏళ్లకి రెండుమూడేళ్లు ఎక్కువుంటాయి! అంత పెద్ద తరహాగల వ్యక్తి నావైపు వారిలోగాని నా భార్యా తరపు వారిలోగాని లేరని నా భార్యకు నేను- నాకు నా భార్య 'హామీ' ఇచ్చుకున్నాం. అయితే యీ పెద్ద మనిషి బంధువుకాని ఆప్తుడై వుండాలి! రేషన్ రోజుల్లో యిలాటి వారు కూడా బసవేస్తే ఎలాగ? అనుకున్నాను. అయినా 'ప్రొద్దున వచ్చిన వర్షం - ప్రొద్దున వచ్చిన చుట్టం ఉండడం అరుదు' అనే సామెత జ్ఞాపకం తెచ్చుకొని తాపీ పడ్డాను - ఎందుకైనా మంచిదని భార్యని భోజన ప్రయత్నం చెయ్యమన్నాను.

'హేండ్ బేగ్' సర్దుకొంటున్న ఆయన చేతిలోనుండి ఏదో కాగితం క్రిందపడింది. తీసి ఇచ్చేద్దామని చూసేను.... దానిమీద 'ఎడిటర్ భాగ్యోదయ' అని ఉంది! అది చూడగానే సాక్షాత్తు ఆ పరమేశ్వరుడు వచ్చి మా యిల్లు పావనం చేస్తున్నాడనిపించింది! ఇంక నేను ఎలాంటి కథలు వ్రాసినా వెంటనే అచ్చవుతాయి! అనుకొని పొంగిపోయాను - నా పేరు పైకి రావడానికి రోజులు దగ్గర పడ్డాయనుకున్నాను. ఎడిటర్ నేనూ టేబిల్ ముందు కూర్చున్నాం.

'అయితే ఎడిటర్జీ ఇదే రావడమా?'

'ఓ మై గాడ్! నేను ఎడిటర్నని మీకెలా తెలిసింది! ఇంతకీ మీరు కవులుగా అలి వేగిరం గ్రహిస్తారు!'

'ఆ! దానికేం లెండి, మీరు నాకథలని ప్రచురించినందుకు నా కృతజ్ఞత.'

'కథల్లో విలువుంటే ప్రచురించకేం! నేనేమిటి అందరూ తీసుకుంటారు.'

'అలా అనకండి. కొన్ని పత్రికలు తప్పమిగిలినవి కొందర్ని నిర్ణయించుకొని వారి రచనలనే ఎలా ఉన్నా ప్రతి నెలా వేస్తూ ఉండడం క్రొత్తవారిని ప్రోత్సహించక పోవడం, చూస్తూ ఉన్నాం కదూ'.

'పాత పాతేలెండి! అదీ కాక కొత్తవాళ్ళు పైకి వచ్చేది ఎప్పుడు? వాళ్ళని ప్రోత్సహించకపోతే నిరాశతో కథలు వ్రాయడమే మానుకుంటారు.'

'పారితోషికం ఎలాగో ఇచ్చేది లేదు. ఆపాటి సహాయం ఐనా చెయ్యొద్దా!'

ఇలా ఊసు లాడుకుంటూండగా మా ఆవిడ భోజనం తయారయిందని చెప్పింది. ఓమారు మెహర్బానీకి హోటల్లో తింటా లెండి అని అన్నాడు గాని కూర్చున్న తర్వాత పావుసేరు బియ్యం అన్నం, ఒక్క మెతుకులేకుండా ఊదేసేడు - 'ఎడిటర్' అనే పేరు తల్చుకొనేసరికి అతడిని ఎక్కువగా మర్యాద చేయాలని ఏదో శక్తి నన్ను ప్రోత్సహించింది. ఆ వారం రోజులూ రాజభోగం జరిపేను- క్రొత్త అల్లుడైనా అత్తారింట్లో అటువంటి సత్కారం పొందలేడేమో! ఆఖరు రోజుని కెమేరా పైకి తీసి నన్ను నిలుచోమన్నాడు. యిదేమిటని వింతగా అడిగాను. తన పత్రిక తాలూకు జన్మదినం రాబోయేనెల అనీ, దానికి రచనల్ని రచయితల ఫోటోలతో సహా ప్రచురిస్తామని చెప్పి ఫోటో తీశాడు! ప్రకటించేందుకు మంచికథలు రెండిమ్మని అడిగాడు. వెంటనే వ్రాసిన వాటిలో మంచివి రెండు ఏరి ఇచ్చాను. తర్వాత సాయంత్రం బండికి ఆయన్ని ఆంపకం పెట్టి వచ్చాను. ఖర్చులకి రెండువందల రూపాయలు కూడా యిచ్చాను.

★★★★

28 వ తారీకు వచ్చింది. యింక నా సంతోషానికి అంతేలేదు. రాతి కింద కప్పకి వర్షం కురిసినట్లయింది. ఇంక రెండు మూడు రోజుల్లో ''భాగ్యోదయ'' వస్తుంది. దానిలో మొదట నా కథే తలకాయంతలేసి అక్షరాలతో, బొమ్మలతో కనపడుతుంది. ఇలా ఎన్నో ఆలోచనలు పాతికవేగస్సుతో వచ్చి బుర్రలో అన్లోడు అయిపోయాయి.

భాగ్యోదయ వచ్చింది!.... కాని - దానిమీద జన్మదిన సంచిక అనిగాని మరేవిధమైన మార్పుగాని లేదు. నాకు రావలసిన కాపీ రాలేదు. ఇంక నా బుర్రలో అనుమానాలు రెండెడ్ల బళ్ళులా చప్పుడు చేసుకుంటూ నడుస్తున్నాయి. ఒణుకుతున్న చేతుల్తో అర్ధరూపాయి సెల్లర్‌కి యిచ్చి కాపీ తీసుకున్నాను. ఒక్కొక పేజీ జాగ్రత్తగా తిరిగవేసి చూశాను. కాని అఖరుకి ఆఖరు పేజీలో కూడా చీమ తలకాయలంత అక్షరాలతోనైనా నా రచన లేదు. ఎడిటర్ని నమిలి మ్రింగేయాలన్నంత కోపం వచ్చింది. నాకు తెలియకుండా నా చెయ్యి భాగ్యోదయ కవరు పేజీని చింపేసింది. వెంటనే ఇంటికి వచ్చి జరిగిన విషయాలతోనూ, ఎడిటర్నీ, పత్రికనీ ఘాటుగా విమర్శిస్తూ మరో పత్రికకు విమర్శను పంపేను. నేను పంపిన మరుసటి నెలలోనే ఆ పత్రికలో ప్రతి విమర్శ తీవ్రంగా ఆ ఎడిటర్ వద్దనుండి వచ్చింది.-

'నేను వ్రాసిన విమర్శ చూసిన తరువాత ఏడవాలో నవ్వాలో తెలియలేదనీ, తాను అలా ఊళ్లె వెంట తిరిగలేదనీ, మా యింటికి రాలేదనీ - తమ పత్రిక జన్మదినం ఉగాదినాడు కాని ఆ నెల కాదని-

ఎవడో తన పేరుని దగాచేసి ఉంటాడనీ, దీనికి తగిన క్షమాపణ యివ్వకోకపోతే కథక్లయిమాక్సుకి పోతుందని'' - దాని సారాంశం. అది చదివిన తర్వాత ఏడుపు వచ్చింది. ఆలోచించకుండా విమర్శ చేసినందుకు నన్ను తిట్టుకున్నాను. నిజంగా ఎవడో అన్యాయం చేసి వుంటాడని వాడికి తగిన ప్రతీకారం ఎప్పటికైనా తీర్చుకోవాలని అనుకున్నాను. వెంటనే క్షమాపణ పత్రం ఎడిటర్‌కి పంపుకున్నాను.

ఆ దినం టైపు చేస్తూన్న ఆర్డరు, ఆఫీసర్ చేతిలోని సర్టిఫికేట్ బుక్కూ చూసేసరికి నాకు చాల ఆశ్చర్యం వేసింది. ఏమంటే - గోపాలరావూ, నేనూ చిన్నప్పటి స్నేహితులం! - నా తోనే ఎస్. ఎస్. ఎల్. సి. చదివి పాసయ్యేడు. పాపం ఏదో జబ్బు వచ్చి హఠాత్తుగా చనిపోయాడు. అతని సర్టిఫికేట్ బుక్కు చాలాసార్లు చూశాను - ఆ సర్టిఫికేట్ బుక్కే! ఆ పేరు గల ఆర్డరే వచ్చింది! - అందుకే ఆశ్చర్యం వేసింది!.ఇందులో ఏదో రహస్యం ఉందని గ్రహించాను. కాని నా విధి ప్రకారం ఆ ఆర్డరు టైప్ చేసి పోస్టు చేశాను -

ఆ మర్నాడు చేతిలో ఆ ఆర్డరు పట్టుకొని నన్ను మోసం చేసిన పెద్దమనిషే వచ్చాడు. అతడిని చూశాక మరీ ఆశ్చర్యం వేసింది! యిది కూడా మోసం అయివుంటుందనుకొని అప్రయత్నంగా 'ఎడిటర్జీ' అని పిలిచాను. అది అతడు విని ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి నన్ను చూసి గతుక్కుమన్నాడు, నేను దగ్గరకు వెళ్ళాను.

'ఫర్వాలేదు లెండి, మీరు చేసిన మోసానికి ఏం చేస్తానో అనా ? ఏమీ చెయ్యను. మీ పనిమీద వెళ్ళండి అన్నాను. ఆయన మరి నిలబడలేక వచ్చిన తోవనే వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు పార్కులో ఆ పెద్ద మనిషి ఒంటిరిగా కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాడు. అదే సమయం అని నేను వెళ్ళేను. నన్ను చూసి జంకుతూ కొంచం జరిగేడు -

'మీరు నిన్న ఉద్యోగంలో ప్రవేశించలేదా ?'

'ఆఁ! ఏమన్నారు ? లేదండి రేపు ప్రవేశిస్తా.'

'నేనో విషయం అడుగుతా చెబుతారా ?'

'ఆఁ అడగండి. చెప్తా!' అని జంకుతూ అన్నాడు -

'అయితే ఆ సర్టిఫికేట్ బుక్కు ఎవరిది ?'

'ఆఁ! ఆఁ! నాదే... నాదేనండి!'

'నిజం చెప్పండి! ఆ పేరుగల ఆయన చనిపోలేదూ ?'

(ఆశ్చర్యంతో) - 'బాగుంది! నేనేనండీ అదేమిటి అలా అంటారు ?'

'నాకు తెలుసులెండి అంతా - అసలు విషయం సెలవివ్వండి!'

'ఏమిటి తెలుసు మీకు! అంతా అర్థం కాకుండా వుంది!'

'అవునవును. అర్థం ఎలా అవుతుంది ? అందర్నీ మోసం చెయ్యడం అర్థమౌతుంది కాని!'

'యింతకీ మీ రనేదేమిటీ ?'

'ఏమిటా ? మీరు తెచ్చిన సర్టిఫికేటు బుక్కు నా చిన్నప్పటి స్నేహితుడిది. ఆయన చనిపోయాడు. అది మీకెలా వచ్చిందని నేను అడుగుతున్నాను!' అని గద్దించేసరికి -

'క్షమించండి . దానికి నేనిప్పుడు జవాబు చెప్పలేను !' అంటూ ఆ పెద్దమనిషి గబగబా, వెళ్ళిపోయాడు. మళ్ళీ పిలిచి నిలవ తీద్దామనుకున్నానుగాని నలుగురిలో బావుండదని ఊరుకున్నాను.

ఆ రాత్రి భోజనం చేసి ఏదో పుస్తకం పేజీలు తిరగవేస్తూంటే ఎవరో వచ్చేరని కబురు వచ్చింది! బయటకు వెళ్లేసరికి ఆ పెద్దమనిషి వచ్చి నిలబడ్డాడు. ఆయనని లోనికి పిలిచి కూర్చోమన్నాను. ఆయన, కూర్చుని -

'' మిమ్మల్ని ఆ విధంగా మోసం చేయడానికి కారణం నా పరిస్థితే. నేనూ చదువుకున్నాను గాని- ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. నాన్నగారు ఆ మధ్యనే పోయేరు. కుటుంబంలో నేనే పెద్దవాడిని- తమ్ముళ్ళూ చెల్లీ యింకా చిన్నవాళ్లు - నాకా ఉద్యోగంలేదు. ఈ బాధ్యత అంతా నేను తప్ప ఎవరు భరిస్తారు. ఏదో విధంగా పోషించక తప్పదు. భయపడి వారి మానాన్ని వాళ్లను వదిలి పారిపోయే పిరికి మనస్తత్వం కాదు నాది-

ఎవరి బుద్ధి ఎలా నడుస్తుందో ఎవరు చెప్పగలరు ? - ఒకరి బలహీనత ఎక్కడ వుందో కనిబెట్టి దానికి తగిన పథకం వేసి నమ్మించి మోసం చేసి సంపాదించడం నా బుద్ధికి తోచింది. మీరు కథలు రాస్తారని- ఆ విధంగా మిమ్మల్ని మోసం చేస్తే మీరు సులువుగా వలలో పడతారని అలా చేసాను. యిది మంచి పని కాదని తెలిసినా నాకు గత్యంతరం లేకపోయింది.

ఇలాటి సమయంలో నా మేనమామ కొడుకుకు యీ ఆఫీసులో సెలక్టు అయేడని లెటర్ వచ్చింది. అయితే యింకా ఎపాయింట్మెంట్ ఆర్డర్ రాకముందే ఆకస్మాత్తుగా వాడు చనిపోడం జరిగింది. తర్వాత ఆర్డరు వచ్చింది. అదే అవకాశం అనుకుని మా మేనమామను ప్రాధేయపడ్డాను. నేను పరాయివాడిని కాదు కాబట్టి ''జాగ్రత్త'' అని చెప్పి సర్టిఫికట్లూ, ఆర్డరూ యిచ్చాడు. అది పట్టుగొని మీ ఆఫీసుకు వచ్చేను.

ఈ ఆఫీసులోనే మీరు పనిచేస్తున్నారని నాకు తెలియదు. మోసం ఎన్నాళ్లు దాగుతుంది? ఈ రోజు మీదగ్గర పట్టుపడ్డాను. ఇక నా భావీజీవితం మీమీద ఆధారపడి వుంది క్షమించండి !'' అని ముగించాడు.

అతను చెబుతున్నవన్నీ నిజమా ? లేక ఇది కూడా మోసమేనా ? అని అనిపించక పోలేదు. కాని అతని మొహం చూస్తే పశ్చాత్తాప పడి నిజం చెబుతున్నట్టే వుంది.

''ఇంతకు పూర్వం నన్ను మోసం చేశావు కాని యిప్పుడు దేశాన్నే మోసం చేస్తున్నావు, అక్రమంగా ఒక ఉద్యోగాన్ని సంపాదించి మరొక అర్హత గల నిరుద్యోగికి దక్కకుండా అన్యాయం చేస్తున్నావు యిది గ్రహించావా ?'' అని అడిగాను.

అతను తల వంచుకున్నాడు. ఏమీ జవాబు చెప్పలేదు. మనసులో తీవ్రంగా మథన పడుతున్నట్టు అనిపించింది.

ప్రతీకారం తీర్చుకోగల సమయం వచ్చినా - అతని మీద ఆధారపడ్డ కుటుంబాన్ని తలచుగుంటే ఆ అమాయకులని, నిరాధారులనీ, ఆదుకోవడం కోసం - ఏమీ తెలియనట్టు వూరుకోవడమే మంచిదనిపించింది.

''నన్నేం చేయమంటావో చెప్పు!'' అని ఏమీ తోచక అన్నాను.

అతను మరో మాట అనకండా ఆ సర్టిఫికట్లూ, ఎప్లాయింటుమెంటు ఆర్డరూ నా ముందు పెట్టి.

''నా కాళ్ల మీద నేను నిలబడతాను!'' అని వెళ్ళిపోయాడు.

అలా అనకండా ''రహస్యం మీలోనే వుంచుగొని కాపాడండి!'' అని మరోసారి అని వుంటే నేను ఊరుకొనేవాడినేమో!

ఎందుకంటే -

చదువుకున్నా ఉద్యోగాలు దొరకక బ్రతుకు తెరువుకోసం ఈనాడు యువత యిలా దిగజారిపోవడం- కడుపుకోసం, బ్రతకడం కోసం ఎలాటి నికృష్టపు పని అయినా చేయడానికి సిద్ధమవడం, చూస్తే యీ లోపం వ్యవస్థదే కాని అతనిది కాదనిపించింది.

★ ★ ★

*(తెలుగు స్వతంత్ర - 15-12-1950.)*